క్లుప్తంగా

ముగిసిన భజనలు


ముగింపు కార్యక్రమంలో భజనల బృందం

శ్రీశైలంటెంపుల్: కార్తీక మాసం సందర్భంగా గత నెల 2న శ్రీశైల దేవస్థానంలో ప్రారంభమైన శివచతుస్సప్తాహ భజనలు సోమవారంతో ముగిశాయి. కర్నూలుకు చెందిన రెండు భజన బృందాలు, కర్ణాటకకు చెందిన నాలుగు భజన బృందాలు నెల రోజుల పాటు నిరంతరాయంగా రేయింబవళ్లు అఖండ శివపంచాక్షరి నామ భజన కొనసాగించారు. ముగింపు కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామికి పూజలు


పూజలందుకున్న వీరభద్రస్వామి

మిడుతూరు: మండల పరిధిలోని మాసపేట మజారా ఉప్పలదడియ గ్రామంలో వెలసిన వీరభద్రస్వామికి సోమవారం అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, తదితర పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పెద్దలు కమతం వీరారెడ్డి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సంగమేశ్వరంలో విశేష పూజలు

కొత్తపల్లి: మండలంలోని సంగమేశ్వరంలోని ఎగువ పుష్కరఘాట్ వద్ద ఉమామహేశ్వరాలయంలో సోమవారం భక్తులు విశేష పూజలు చేశారు. ముందుగా పుష్కరఘాట్ వద్ద కృష్ణా నదిలో పుణ్యస్నానాలు చేసుకున్నారు. కృష్ణాజలాలతో ఆలయంలోని శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లలితాదేవి అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి ఇచ్చారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏడీఏ విజయశేఖర్


మిడుతూరు: రైతులు సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఏడీఏ విజయశేఖర్ అన్నారు. వ్యవసాయ కార్యాలయంలో సమాచారహక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగ ఏడీఏ మాట్లాడుతూ.. పారదర్శకత, జవాబుదారితనాన్ని పెంపొందించడానికి ప్రభుత్వ అధికారుల నుంచి సమాచారాన్ని పొందేందుకు సమాచార హక్కు చట్టం తీసుకొచ్చారన్నారు. అనంతరం ఏఓ పీరునాయక్ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు ఏ విధంగా చేసుకోవాలి? రుసుం ఎంత చెల్లించాలి? అనే విషయంపై అవగాహన కల్పించారు.

వైద్య చికిత్సలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నందికొట్కూరు: మండల పరిధిలోని కొణిదెల జెడ్పీ హైస్కూల్‌లో ఒకేషనల్ కోర్సు చదువుతున్న విద్యార్థులు సోమవారం ప్రభుత్వ వైద్యశాలను సందర్శించారు. విద్యార్థులకు వైద్యులు, హెడ్ నర్సు ఓపీ విభాగం, కాన్పుల వార్డు, చిన్న పిల్లల వార్డు, అత్యవసర వార్డు, ఆపరేషన్ థియేటర్, మందుల విభాగం, మార్చురీ విభాగాలను చూపించారు. వార్డులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల వెంట ప్రధానోపాధ్యాయుడు శ్రీరామచంద్రమూర్తి, టీచర్ షాకీర, తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం


ప్రజా సమస్య పరిష్కార వేదికలో వివిధ శాఖల అధికారులు

జూపాడుబంగ్లా: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు అందజేస్తే విచారించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మేజర్ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, ఏఈలు బషీర్, నాగేంద్ర, ఏపీఎం అంబమ్మ, ఏపీఓ గౌరీబాయి, హౌసింగ్ ఏఈ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంటే ఇంత చులకనా!

- కల్లు పెంటలు...మరుగు దొడ్డి ఎదుట అన్నా క్యాంటీన్
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ, మున్సిపల్ అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు


మరుగుదొడ్డి, కల్లుపెంటలు ఎదుట అన్నా క్యాంటీన్


అన్నా క్యాంటీన్‌లో భోజన చేస్తున్న ప్రజలు

నందికొట్కూరు: ఆరోగ్య సూత్రాలను పాటించాల్సిన అధికారులే వాటిని గాలికి వదిలేసి మరుగుదొడ్డి, కల్లు పెంటలకు ఎదుట అన్నా కాంటీన్ ఏర్పాటు చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. క్యాంటీన్‌కు పది అడుగుల దూరంలోనే రెండు కల్లు పెంటలు ఉన్నా ఎక్సైజ్ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు మామూళ్ల మత్తులో మునిగి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు లేకపోలేదు. అపరిశుభ్ర వాతావరణంలో అన్నాక్యాంటీన్ ఏర్పాటు చేయడం ఎంత వరకు సబబని పలువురు ప్రశ్నిస్తున్నారు. మనుషులను పశువుల కన్నా హీనంగా ప్రభుత్వం చూస్తోందని చెప్పడానికి ఇదే నిదర్శనమని వాపోతున్నారు. దుర్వాసతో నిండిన మరుగుదొడ్డికి పది అడుగుల దూరం, నిత్యం తాగుబోతులతో ఉన్న కల్లుపెంటకు ఎదుట 10 అడుగుల దూరంలో అన్నా క్యాంటీన్ నందికొట్కూరు పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో మున్సిపాలిటీ స్థలంలో ఏర్పాటు చేస్తున్నారు. దుర్వాసన నిండిన ప్రాంతంలో అన్నా కాంటీన్ నిర్మించడం దారుణమని అంటున్నారు. కలెక్టర్ స్పందించి రెండు కల్లు అంగళ్లు, మరుగుదొడ్డిని తొలగించి ప్రశాంతమైన వాతావరణంలో అన్నా క్యాంటీన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అపరిశుభ్రత వాతావరణంలో అన్నా క్యాంటీన్



అపశుభ్రంగా ఉన్న ప్రదేశంలో అన్నా క్యాంటీన్ ఎలా నిర్వహిస్తారు. ప్రజలంటే ప్రభుత్వానికి ఎంత చులకనో దీని బట్టి చూస్తే తెలుస్తోంది. దుర్వాసన ఉన్న ప్రాంతంలో అన్నా క్యాంటీన్ నిర్వహించడం వల్ల రోగాలకు వస్తే ఎవరు బాధ్యత వహిస్తారు. అధికారుల కుటుంబాలు ఇలాంటి దుర్వాసన నిండిన ప్రాంతంలో భోజనం చేస్తారా. అధికారులు మామూళ్ల మత్తులో కల్లు అంగళ్లకు అనుమతులు ఇస్తారు. ఈ ప్రాంతంలో మహిళలు నిత్యం తిరుగుతుంటారు.

–నరసింహులు, జిల్లా కార్యదర్శి, సీపీఐ(ఎంఎల్)

ఎంత వరకు సమంజసం



ఆరోగ్య సూత్రాలను పాటించకుండా అన్నా క్యాంటిన్ ఏర్పాటు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి. కమీషన్లకు కక్కుర్తి పడి అధికారులు మరుగుదొడ్డి, కల్లు దుకాణాల ఎదుట క్యాంటిన్ నిర్వహించడం ఎంత వరకు సమంజసం. మనుషులను పశువుల కన్నా హీనంగా చూడడం ప్రభుత్వ ధ్యేయమా. అధికార పార్టీ పాలకులకు, అధికారులకు ప్రజలపై ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతోంది. పైసలు ఇస్తే బెల్ట్ షాపులు కూడా అన్నా క్యాంటిన్ ఎదురుగా పెట్టిస్తారు.

–వెంకటేశ్వర్లు, సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకుడు

ఇంత దారుణమా?



అపరిశుభ్రత, దుర్వాసన ఉన్న ప్రాంతం, మద్యం దుకాణాల మధ్య హోటల్స్, టిఫన్ సెంటర్లు కూడా ఏర్పాటు చేయరు. అలాంటిది ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ కలిసి రెండు కల్లు అంగళ్లు, మరుగుదొడ్డి ఎదుట కంపు కొడుతున్న ప్రాంతంలో అన్నా కాంటీన్ ఏర్పాటు చేశారు. భోజనం చేసేందుకు వెళ్లిన వారు దుర్వాసకు తినలేకపోతున్నామని చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మంచి వాతావరణంలో దుర్వాసన లేని ప్రాంతంలో అన్నా కాంటీన్ ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలి.

–అల్లూరు కృష్ణ, కౌన్సిలర్

అంజన్నకు ప్రత్యేక పూజలు



ఆత్మకూరు: పాత బస్టాండు సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు స్వామివారికి వేకువజామున ఐదు రకాల హారతులు ఇచ్చారు. పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆర్థిక సాయం


విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

శ్రీశైలం: దేవస్థానం కాంట్రాక్ట్ ఉద్యోగి ప్రసాద్ కూతురు తనూజకు బాజీ చౌదరి రూ.30 వేల ఆర్థిక సాయం చేశారు. తనూజ ఇంటర్ బైపీసీ పూర్తి చేసింది. బీఫార్మసీ చేయటానికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ప్రసాద్ మిత్రుడు ఎల్లా రాజశేఖర్‌రెడ్డి బాజీ చౌదరి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించి రూ.30 వేలను అందజేయడంతో తండ్రీ, కూతురు కృతజ్ఞతలు తెలిపారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో వీసీ

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో రాయలసీమ యూనివర్సిటీ వీసీ ఎన్‌టీకే నాయక్, ఎగ్జామ్స్ కంట్రోలర్ వెంకటేశ్వర్లు సోమవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి స్వాగతం పలికారు. పూజలు అనంతరం వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

ఆత్మకూరులో మోస్తరు వర్షం


ఆత్మకూరులో జల్లులు కురుస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజులుగా మోస్తరు వర్షం కురిసింది. సోమవారం ఉదయం నుంచి విడతల వారిగా చిరుజల్లులు మొదలుకొని ఒక మోస్తరు వర్షం కురిసింది. డిసెంబర్‌లో సాధారణంగా ఆత్మ కూరు ప్రాంతంలో వర్షాలు కురవడం చాలా అరు దు. తుఫాన్ ప్రభావం మరో రెండు రోజుల పాటు ఉందని అధికారులు చెబుతుండటంతో వరి, మినుము, పొగాకు రైతులు ఆందోళన చెందుతున్నారు.

శ్రీశైలంలో ..

శ్రీశైలం: శ్రీశైల మహా క్షేత్రంలో ఎడతెరిపినివ్వకుండా వర్షం కురిసింది. భక్తులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మల్లన్నను దర్శించుకున్నారు. కాగా శ్రీశైలానికి వాహనాల్లో వచ్చే భక్తులు ఘాట్ రోడ్‌లో నెమ్మదిగా రాకపోలు సాగించాలని పోలీసులు సూచిస్తున్నారు. కొండ రాళ్లు విరిగిపడే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా గమ్య స్థానాలకు చేరుకోవాలని సూచించారు.

రోడ్డుపై విరిగిపడిన వృక్షం


రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన వృక్షం

మహానంది: మహానంది మండలం బుక్కాపురం గ్రామ సమీపంలోని చర్చి వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్టు పడిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నంద్యాల నుంచి మహానంది, మహానంది టూ నంద్యాల వెళ్లే ప్రయాణికులు, భక్తులు అవస్థలు పడ్డారు. స్థానిక యువకులు పరిస్థితిని సమీక్షించి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

ఆటో సీజ్

మహానంది: అటవీ కలపను అక్రమంగా తరలిస్తున్న ఓ ఆటోను పోలీసులు తనిఖీ చేసి అటవీ శాఖ అధికారులకు స్వాధీనం చేసిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. మహానంది నుంచి ఆటోలో ఎర్రచందనం తరహాలో ఉన్న కలపను తరలిస్తుండగా బొల్లవరం మెట్ట వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అనుమానం వచ్చి తనిఖీ చేశారు. కలప దుంగలను గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. మహానంది అటవీ శాఖ డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హైమావతి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకొని ఆటో స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అదుపులోకి తీసుకొని గాజులపల్లె రైల్వే స్టేషన్ అటవీ డిపోకు తరలించారు.

మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి


కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం

నందికొట్కూరు: మున్సిపల్, ఇంజినీరింగ్ కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో 30 ఏళ్ల నుంచి పనిచేస్తున్నా వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు. ప్రజలకు నిత్యం సేవలందిస్తున్న కార్మికులకు కనీస వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. జీఓ నంబర్ 36 ప్రకారం కార్మికులకు వేతనాలు పెంచాలని కోరారు. ఏడాదికి రెండు జతల యూనిఫాం, కుట్టు చార్జీలు, చెప్పులు, సబ్బులు, నూనెలు ఇవ్వాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సీఐటీయూ నాయకులు గోపాలకృష్ణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, ఖాజాబాషా, నాగన్న, శ్రీను, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన


గౌరీ మోక్షేశ్వరస్వామికి బిల్వం సమర్పిస్తున్న భక్తులు


బిల్వార్చనకు తరలివచ్చిన మహిళలు

పగిడ్యాల: మండలంలోని పడమర ప్రాతకోట గౌరీ మోక్షేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన లక్ష బిల్వార్చన కనుల పండువగా జరిగింది. ఉదయం గణపతి పూజ, హోమం, మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, శివపార్వతుల కల్యాణం తదితర పూజా కార్యక్రమాలను పురోహితులు రవివర్మ, బాలక్రిష్ణశర్మ, ధనుంజయ శర్మ, ప్రవీణ్ శాస్త్రోక్తంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బిల్వం ఆకులను మోక్షేశ్వరస్వామికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు వన భోజనం ఏర్పాటు చేశారు. బాలాజీ సేవా సంస్థ సభ్యులు భక్తులకు సేవలందించారు. గ్రామ పెద్దలు లగిశెట్టి లక్ష్మయ్య, చక్రపాణి, శేషఫణి, అంబటి శివశంకర్‌రెడ్డి నూతన కల్యాణ మండపానికి విరాళాలు అందజేసిన దాతలను ఘనంగా సన్మానించారు.

ఎంఎస్‌ఎంఈ సర్వే

పాములపాడు: గ్రామాల్లో దుకాణాల వద్ద సచివాలయ సిబ్బంది ఎంఎస్‌ఎంఈ సర్వే చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఈ సర్వేలో దుకాణదారుడి నుంచి ఉద్యం రిజిస్టర్, లేబర్ సర్టిఫికెట్, చిరు వ్యాపారమా.. మధ్యస్థ వ్యాపారమా? కుటీర పరిశ్రమ వంటి వివరాలు అప్‌లోడ్ చేశారు. వ్యాపారం నిర్వహిస్తున్న భవనం సొంతమా, అద్దెదా అనే వివరాలు సేకరిస్తున్నారు. అయితే ఈ సర్వే ఎందు కోసం నిర్వహిస్తున్నారో అర్థం కావడం లేదని దుకాణదారులు వాపోతున్నారు. ఈ సర్వే వల్ల ఉపయోగమా నష్టమా అని తలలు పట్టుకుంటున్నారు. ఎందు కోసం చేస్తున్నారో తెలియజేస్తే బాగుంటుంది కదా అని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ప్రతి దరఖాస్తును పరిష్కరిస్తాం

కొత్తపల్లి: అధికారుల దృష్టికి వచ్చిన ప్రతి దరఖాస్తును సత్వరమే పరిష్కరిస్తామని తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో కలిసి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అర్జీల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారం చూపిస్తామన్నారు. అందులో భాగంగానే 8 దరఖాస్తులు భూముల ఆన్‌లైన్ సమస్యలు, పుట్టిన రోజు ధృవపత్రాలు, భూముల సర్వే కోసం వచ్చాయన్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

బందెలదొడ్డి సమస్యను పరిష్కరించాలి

కొత్తపల్లి: గ్రామంలో నెలకొన్న పశువుల బందెలదొడ్డి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు గడ్డం సుబ్బరాయుడు, దుర్గం వెంకటరాముడు, గుండి శేషన్న, దేవనూరు చిన్నమద్దిలేటి కోరారు. సోమవారం ఎర్రమఠం గ్రామంలో మాట్లాడుతూ.. కొంత కాలంగా బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన ప్రజలు గ్రామానికి సంబంధించిన పంట పొలాల్లో ఎవరి పశువులైనా మేతమేసి నష్టం కలుగజేస్తే వాటిని గ్రామంలోని బందెలదొడ్డిలో వేసి రుసుం వసూలు చేసేవారని తెలిపారు. అయితే ఇటీవల అగ్రవర్ణాలకు చెందిన కొందరు బందెలదొడ్డికి వేసిన తాళంచెవిలు తీసుకుని తామే నిర్వహిస్తామని దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. దీంతో పాటు గ్రామస్తులతో వాగ్వాదానికి దిగినట్లు తెలిపారు. ఈ విషయం కొత్తపల్లి పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ఇంత వరకు సమస్యను పరిష్కరించే దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. సమస్య జటిలం కాక ముందే అధికారులు, ఎమ్మెల్యే చొరవ తీసుకుని ఇరువర్గాల మధ్య నెలకొన్న సమస్యను పరిష్కరించాలని కోరారు.

8న సాగునీటి సంఘాల ఎన్నికలు

జూపాడుబంగ్లా: మండలంలో ఈనెల 8వ తేదీ ఉదయం 10గంటలకు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేసీ కాల్వ ఆయకట్టుతో పాటు మండ్లెం, తంగడంచ, పారుమంచాల, వీరాపురం చెరువుల కిందున్న ఆయకట్టు రైతులతో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కేసీ కాల్వ కింద 1,640 మంది పురుషులు, 627మంది మహిళా ఓటర్లు కలిపి మొత్తం 2,267 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. మండ్లెం చెరువు కింద 225 పురుషులు, 83 మంది మహిళా ఓటర్లు సహా మొత్తం 308 మంది ఓటర్లు, తంగడంచ చెరువు కింద 120 మంది పురుషులు, 38 మంది మహిళా ఓటర్లు కలిపి 158 మంది, పారుమంచాల చెరువు కింద 330 మంది పురుషులు, 133 మంది మహిళా ఓటర్లు కలిపి 463 మంది ఓటర్లు, వీరాపురం చెరువు కింద 26 మంది పురుషులు, 07 మంది మహిళా ఓటర్లు కలిపి 33 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. మండలం వ్యాప్తంగా 36 టీసీలకు గాను 3,229 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఈనెల 5న నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు 8న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలు జరుగుతాయన్నారు.

ఇంటి పట్టాలు మంజూరు చేయాలని ధర్నా

నందికొట్కూరు: పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట గుడిసెలు నిర్మించుకుని ఏళ్లతరబడి జీవనం సాగిస్తున్న తమకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైరెడ్డి నగర్ వాసులు ధర్నా నిర్వహిచారు. ఎమ్మెల్యే జయసూర్య తమకు హామీ ఇచ్చినా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని గుడిసెవాసులు డక్క శాంతమ్మ, ఇడిగె లక్ష్మిదేవి, గౌషియా, సరోజమ్మ, సుబ్బమ్మ, పార్వతమ్మ, కుమారి, వసంతమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

రబీ పంటలకు సాగు నీరందించాలి


మాట్లాడుతున్న దార సుధీర్

నందికొట్కూరు: తుంగభద్ర డ్యాం, శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గిపోతే రబీ సీజన్‌లో వేసే పంటలకు సాగు నీరు ప్రభుత్వం అందిస్తుందా అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దార సుధీర్ అన్నారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీ కెనాల్ కింద రబీ సీజన్‌లో వేసిన పంటలకు సాగునీరు ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. తుంగభద్ర డ్యాం, శ్రీశైలం డ్యాంలో నీరు తగ్గుతుంటే రబీలో వేసిన పంటలకు ప్రభుత్వం సాగునీరు ఎలా అందిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం కేసీ కెనాల్‌కు సాగునీరు రబీకి అందిస్తారో లేదో తేల్చి చెప్పాలన్నారు. ఎడమగట్టు విద్యుత్ కోసం తెలంగాణ ప్రభుత్వం రోజుకు 10 వేల క్యూసెక్కుల నీటిని వాడుతుండగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా మూడు వేల క్యూసెక్కుల నీటి వాడకంతో శ్రీశైలం ప్రాజెక్టుకు వచ్చే నెలలోపు ఖాళీ కావడం ఖాయమన్నారు. నియోజకవర్గ రైతులకు రబీలో సాగు నీరు ఎలా సరఫరా చేస్తారో సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం నీటి వాడకం నిలిపివేసేందుకు కేంద్ర జలశక్తి సంఘం జోక్యం చేసుకోవాలని కోరారు. కేసీ కెనాల్ ఆయకట్టు కింద మార్చి వరకు సాగునీరు ఇచ్చి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు.

కార్తీక మాసం విజయవంతం

- డీఎస్పీ రామాంజి నాయక్


మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజి నాయక్

శ్రీశైలం: జిల్లా పోలీసు యంత్రాంగం సహకారంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కార్తీక మాస ఉత్సవాలను విజయవంతం చేశామని ఆత్మకు డీఎస్పీ రామాంజి నాయక్ తెలిపారు. సోమవారం వన్ టౌన్ పోలీస్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాలకు హోంగార్డులు మొదలుకొని కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్, ఏఎస్‌ఐలు, ఎస్‌ఐలు, సీఐలు, డీఎస్పీలు కలిపి మొత్తం 400 మందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మూడు పోలీసు బృందాలను మూడు షిఫ్టులలో వినియోగించామన్నారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఐలాండ్‌లను ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలు క్రమబద్ధీకరించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఉత్సవాలను విజయవంతం చేసినందుకు సీఐ ప్రసాద్‌రావును అభినందించారు. సమావేశంలో టూటౌన్ సీఐ చంద్రబాబు పాల్గొన్నారు.

ఆత్మహత్య కేసు పునర్విచారణ

ఔటర్ రింగ్ రోడ్ సమీపంలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఎస్టీ కాలనీకి చెందిన సంతోష్ నాయక్(25) కేసును పునర్విచారణ చేపట్టినట్లు డీఎస్పీ రామాంజినాయక్ తెలిపారు. ఎస్టీ కమిషన్ ఆదేశాలతో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామన్నారు. స్థానికులను అడిగి వివరాలు సేకరించామన్నారు. సాంకేతిక సమస్యలు కూడా ఇందులో ఉన్నాయని, వాటిని ధ్రువీకరించుకోవడానికి మృతుడి సెల్ ఫోన్‌ను మంగళగిరి కేంద్ర పోలీస్ కార్యాలయానికి పంపించామన్నారు. మృతుని తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. విచారణ కొనసాగుతుందని, త్వరలోనే యువకుడిది ఆత్మహత్యా, లేక హత్యా అనేది తేల్చుతామన్నారు.

రైతులకు ఎద్దుల అందజేత


రోళ్లపాడులో రైతులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎస్ఐ ఓబులేసు

మిడుతూరు: శ్రీకృష్ణ గోశాల నుంచి రైతులకు ఎద్దులను అందజేయడం హర్షనీయమని ఎస్ఐ ఓబులేసు అన్నారు. సోమవారం మండల పరిధిలోని రోళ్లపాడు, జలకనూరు, సుంకేసుల గ్రామాలకు చెందిన 10 మంది రైతులకు 10 జతల ఎద్దులను ఉచితంగా అందజేశారు. గోశాల నిర్వహకుడు శ్రీనివాసులు మాట్లాడుతూ.. గతంలో పాదిలి నుంచి కేరళ రాష్ట్రానికి 10 జతల ఎద్దులను కబేళాలకు తరలిస్తుండగా వాటిని సంరక్షించి గోశాలకు అప్పగించినట్లు తెలిపారు. పేద రైతులను గుర్తించి అందజేస్తున్నట్లు తెలిపారు. ఎద్దులు భారమైనప్పుడు తిరిగి గోశాలకు అప్పగించాలని, అమ్ముకోరాదని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జలకనూరు గ్రామ పెద్దలు గుండం శివరామిరెడ్డి, పురోహితులు కిశోర్ శర్మ, రోళ్లపాడు సర్పంచ్ పేరెడ్డి వెంకటరామిరెడ్డి, పేరెడ్డి నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ జయసూర్యపై వేధింపులు ఆపాలి


అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

బండిఆత్మకూరు: మండలంలోని సంతజూటూరు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ జయసూర్యపై వేధింపులు ఆపాలని సీఐటీయూ నాయకులు సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా నాయకులు డి.రత్నం మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో గ్రామ స్థాయిలో తక్కువ వేతనంతో 20 ఏళ్ల నుంచి జయసూర్య ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడన్నారు. అతడిని రాజీనామా చేయాలని స్థానిక నాయకుల నుంచి రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేధింపులు ఆపేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.

10 లోపు సమాచారం పంపండి

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ స్వర్ణోత్సవాల సందర్భంగా ప్రచురించే ప్రత్యేక సంచిక కోసం సమాచారాన్ని పంపాలని ప్రిన్సిపాల్ మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 50 ఏళ్ల కళాశాల చరిత్రతోపాటు పూర్వ, ప్రస్తుత విద్యార్థుల కవితలు, అనుభవాలు, సక్సెస్ స్టోరీలు, గ్రూప్, ఎన్ఎస్ఎస్ శ్రమదాన ఫొటోలు, రచనలు ఈనెల 10వ తేదీలోపు పంపితే ముద్రిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9490022683 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కంప్యూటర్‌పై అవగాహన అవసరం

శ్రీశైలంప్రాజెక్ట్: కంప్యూటర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ లెక్చరర్ డాక్టర్.ఎం.పద్మ సూచించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఆధునిక యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమన్నారు. పోటీ పరీక్షలు సైతం కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహిస్తున్నారన్నారు. అందుకని ప్రతిఒక్కరూ కంప్యూటర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్‌బాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.